# విధ్వంసక ప్రభంజనం!

**-జయంతి పాపారావు**

రాత్రి పన్నెండు దాటింది. చీకటి, చీకటిలా చీకటి చీకటిగా ఉంది. ఆకాశం మబ్బులు మబ్బులుగా ఉంది. వానలేకపోయినా పెనుగాలి వీస్తోంది. లైట్లు ఆరిపోయాయి.

ఎవరో తలుపు తట్టారు. భయం వేసింది. దొంగలనుకున్నాం. ఎందుకంటే - చీకటి రాజ్యం దోపిడీ దొంగలకు పెంపుడు తల్లి లాంటిది. చీకటి దొంగలకు కన్నతల్లిలాంటిది. భయపడుతూ భయపడుతూ నేనూ, నా భార్య స్వేచ్ఛ లేచాం. టార్చ్‌లైటు చేత్తో పట్టుకుని హాల్లోకి వచ్చాం.

'ఎవరు? ఎవరు?'

'నేనూ, బాబాయ్, సుధీర్ని!'

'ఇప్పుడేంటి? ఇలా రావడం ఏంటి?'

'తొందరగా తలుపు తీయండి! తర్వాత అంతా చెప్తాను!'

తలుపు తీశాం. సుధీర్ లోపలకు వచ్చాడు. ఓ అమ్మాయి కూడా లోపలికి వచ్చింది. ఆయాసపడుతూ మౌనంగా కూర్చున్నారు. మంచినీళ్లు తాగారు. భయంగా, అలజడిగా కనిపిస్తున్నారు. మేం అర్థంచేసుకున్నాం. మౌనంగా కొంతసేపు గడిచింది.

'ఏం జరిగింది?'

మౌనం! మౌనం!

'ఏం జరిగింది?'

భయం! భయం!

'భయపడకండి! చెప్పండి!'

'పదిహేను రోజులైంది. నేనూ సుజాత ఊరొది లేచి వచ్చేశాం! ఇల్లొదిలేసి వచ్చేశాం! ఇక్కడా, అక్కడా తలదాచుకుంటున్నాం! మా నాన్న కత్తిపట్టుకుని తిరుగుతున్నాడు! అంతటా మా కోసం వెదుకుతున్నాడు! ఎంత చెప్పినా, ఎంత బతిమలాడిన మా పెళ్లికి ఒప్పుకోలేదు! పారిపోయి వచ్చేశాం! ఎంతకాలం లాడ్జీలలో ఉండగలం?! డబ్బయిపోయింది. మా నాన్నకు భయ పడి మా బంధువులెవరూ కూడా ఆదుకోలేదు! ఎవరింట్లోనూ కూడా అడుగుపెట్టనీయలేదు!' సుధీర్ అలా చెప్పి, మౌనంలో కూరుకుపోయాడు. ఆ అమ్మాయి మతి పోయినట్లు మౌనంలో బొమ్మలా ఉండిపోయింది. మా జవాబు కోసం బెదురుబెదురుగా చూస్తున్నారు.

'భయం లేదు. మా ఇంట్లో ఉండండి' మేం చెప్పాం. ఇద్దరూ మా పాదాలను స్పృశించారు. మేం ఆశీర్వదించాం. ఓదార్చాం. ధైర్యం చెప్పాం. నవ్వించాం.

వాళ్లు ఆకలిగా ఉన్నట్లు కనిపించారు. స్వేచ్ఛ వంట గదిలోకి వెళ్లింది.

వాళ్లు స్నానాల గదిలోకి వెళ్లారు.

నిద్ర నన్ను ఊపేస్తోంది. నిద్ర తల్లి లాంటిది. నిద్ర ఒడి తల్లి ఒడిలాంటిది. తల్లి ఒడి బాల్యంలోనే పోతుంది. నిద్ర ఒడి జీవితాంతం ఉంటుంది. నిద్ర గొప్ప సుఖం. గొప్పశక్తి. గొప్ప వ్యసనం. స్త్రీ లేదా పురుష సుఖం జీవితంలో కొంతకాలమే ఉంటుంది. నిద్ర సుఖం జీవితాంతం ఉంటుంది. శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయే వరకూ ఉంటుంది. నిద్రను నేను తల్లిలా ప్రేమిస్తాను. స్వేచ్ఛను ప్రేమించినట్లు ప్రేమిస్తాను. అయితే - ఆ రాత్రి నిద్ర ఆపుకోక తప్పలేదు. సుధీర్ సుజాతలు ఎన్నాళ్ల నుంచో నిద్రలేనట్లు కనిపిస్తున్నారు. విషయం తెలుసుకోవాలని నిద్ర ఆపుకుని కూర్చున్నాను.

స్నానాలయ్యాయి. భోజనాలయ్యాయి. వచ్చి హాల్లో కూర్చున్నారు. సమాజం ఎంతో మారిపోయిందంటారు. వచ్చిన మంచి మార్పు చాలా చాలా చాలా తక్కువే. చెడ్డే పెరిగిపోతోంది. మన జనాభాలా పెరిగిపోతోంది.

'మీ నాన్న పెళ్లికి ఒప్పుకోలేదా?'

'లేదు'

'ఎందుకొప్పుకోలేదు?'

'తెలీదు. చెప్పలేదు'

'మీరిద్దరూ ఒక మతం వాళ్లే కదా?'

'అవును'

'ఒక కులం వాళ్లే కదా?'

'అవును'

'మీ నాన్న ఎన్ని కోట్లు కట్నం అడిగాడు?'

'సుజాత తండ్రి ఎన్ని కోట్లయినా ఇవ్వగలడు!'

'నువ్ పెద్ద చదువు చదివావు కదా?'

'సుజాత కూడా పెద్దచదువే చదివింది'

'జాతకాలునప్పాయా?'

'నప్పాయన్నారు'

'కుటుంబ శత్రుత్వాలున్నాయా?'

'లేవు'

'ఇద్దరూ చక్కగా ఉన్నారు! ఈడూ జోడూ బాగుంది!'

'అందరూ అలాగే అన్నారు!'

'మరెందుకొప్పుకోలేదో!?'

'తెలీదు! చెప్పలేదు!'

'స్త్రీ పురుషులు యువతీయువకులు ప్రేమించుకుని కలిసి జీవించకుండా మనం ఎన్ని అవరోధాలు నిర్మించుకున్నామో! మతం-కులం-కట్నం- జాత కాలు - కుటుంబ శత్రుత్వాలు - చదువులు - ఆర్థిక అంత రాలు - శరీరరంగు - జీవనశైలి - ఇలాంటి అడ్డులు ఎన్నెన్ని నిర్మించుకున్నామో! ఎందుకు నిర్మించు కున్నామో! ఇంకా ఎన్ని అవరోధాలు నిర్మిస్తామో! తల్చుకుంటే భయమేస్తోంది! ప్రేమ - స్వేచ్ఛ - లేని జీవితాలెందుకు? సమాజం ఎందుకు? మనం ఎందుకు అవరోధాల్ని అధిగమించలేకపోతున్నాం? మనకు జీవించడం తెలీదా?!' అలా అలా స్వేచ్ఛ ఆవేదన వ్యక్తం చేసింది. వాళ్లిద్దరూ చాలా ఆసక్తిగా విన్నారు.

స్వేచ్ఛ వాళ్లని మేడమీద గదికి తీసుకువెళ్లింది. రెండు గంటలయింది. నేను నా గదిలోకి వెళ్లి నడుం వాల్చాను.

❖ ❖ ❖

సుధీర్ అగ్రికల్చరల్ సైన్స్‌లో ఎమ్మెస్సీ చేశాడు. బాగా తెలివైనవాడు. వినయ విధేయతలున్నవాడు. తక్కువగా మాట్లాడుతాడు. తండ్రి చెప్పినట్లే వ్యవ సాయం చూసుకుంటున్నాడు. విశాఖపట్నం వచ్చినప్పు డల్లా మా ఇంటికి వస్తాడు. కిందటిసారి వచ్చినప్పుడు కొంతసేపు నాతో మాట్లాడాడు. ఓమాట అన్నాడు. అది నాకు గుర్తుకొచ్చింది. 'నాకు కాళ్లూ చేతులూ, కళ్లూ ఉన్నాయి! ఆలోచించే శక్తి ఉంది. కష్టపడి పనిచేయడానికి ఆరోగ్యం ఉంది! నేను కష్టపడి పనిచేసి నా బతుకు నేను బతకగల్ను! నాకు ఆస్తి పెంచడానికి మా నాన్న ఎందుకు అంతలా చేస్తున్నాడో నాకు అర్థం కావడం లేదు!' అని ఆవేదన పడ్డాడు. వెళ్లిపోయే ముందు మరో చిన్నమాట కూడా అన్నాడు. 'మీ ఆలోచన్లకీ, మా నాన్న ఆలోచన్లకీ ఎక్కడా పోలికే లేదు! మీరిద్దరూ అంత స్నేహంగా ఎలా ఉంటున్నారో నాకు ఆశ్చర్యం వేస్తోంది!' అలా అని చిరునవ్వు నవ్వుతూ వెళ్లిపోయాడు.

❖ ❖ ❖

సుధీర్ తండ్రి రుద్రయ్య చౌదరి నాకు బాగా తెలుసు. చిన్నప్పట్నుంచీ తెలుసు. స్నేహంగా ఉంటూ వస్తున్నాం. ఇద్దరం కొంతకాలం ఒకే ఆఫీసులో పని చేశాం కూడా. రుద్రయ్య చౌదరి బాగా వున్నవాడు. కొంతకాలం ఉద్యోగం చేసి, ఆ తర్వాత వ్యవసాయం లోకి వెళ్లిపోయాడు. వ్యవసాయం కలిసొచ్చింది. ఆ తర్వాత వ్యాపారంలోకి కూడా వెళ్లిపోయాడు.

ఒక వ్యసనం మరెన్నో వ్యసనాలను నేర్పుతుంది. ఒక హింస మరెన్నో హింసలను చేయిస్తుంది. ఒక నేరం మరెన్నో నేరాలు చేయిస్తుంది. ఒక దొంగతనం మరెన్నో దొంగతనాలు చేయిస్తుంది. ఒక దోపిడి మరెన్నో దోపిడీలు చేయిస్తుంది. రుద్రయ్య చౌదరికి అదంతా బాగా తెలుసు. అలాగే రుద్రయ్యచౌదరి ఒక వ్యాపారం ప్రారంభించి, మరెన్నో వ్యాపారాల్లోకి విస్తరించాడు. అతడు అక్కడే ఆగిపోలేదు. వ్యాపారా లన్నింటి కంటే రాజకీయ వ్యాపారమే ఎక్కువ లాభ దాయకమని నిర్ధారించుకుని అందులో కూడా వెళ్లి పోయాడు.

అయినా, మా ఇద్దరి మధ్య స్నేహం చెదిరి పోకుండా నిలబడింది.

బలహీనతలు బహుముఖంగా ఉంటాయి. ఆస్తి పట్ల ఆశ అందరికీ ఉంటుంది. డబ్బు పట్ల వ్యామోహం అందరికీ ఉంటుంది. కీర్తిపట్ల కోరిక అందరికీ ఉంటుంది. గుర్తింపు పట్ల వాంఛ అందరికీ ఉంటుంది. గెలుపు పట్ల ఆకర్షణ అందర్లో అందరికీ ఉంటుంది. అలాగే స్నేహం పట్ల బలహీనత కూడా కొద్దిమందిలో నైనా కొంతైనా వుంటుంది. అన్ని బలహీనతలూ ఉన్నట్టుగానే రుద్రయ్య చౌదరికి స్నేహం పట్ల కూడా కొంత బలహీనత ఉంది. అందువల్లే మా స్నేహం చెదిరిపోకుండా నిలబడింది!

సుధీర్ వల్ల మా స్నేహం శత్రుత్వంగా మారి పో తుందనే భయం నాలో బయలుదేరింది. గుండె అల జడిస్తోంది. ఎన్నో సంవత్సరాలుగా నిలబడిన స్నేహం నిలువునా కూలిపోతుందనే వ్యధ నన్ను కూల్చేస్తోంది.

ప్రేమ గొప్పది. కపట ప్రేమలు జీవితాలను కూల్చే స్తాయి. నిజమైన ప్రేమలు మానవ జీవితాన్ని ఉన్నతీ కరిస్తాయి. స్త్రీ పురుషుల మధ్య ప్రేమ గొప్పది. అయితే, మనుషుల మధ్య ప్రేమ అంతకంటే గొప్పదని నేను విశ్వసిస్తాను. ఎందుకంటే - అది సమాజాన్ని ఉన్నతీక రిస్తుంది. నాలోని అటువంటి విశ్వాసం వల్ల, రుద్రయ్య చౌదరికి స్నేహం పట్ల ఉన్న బలహీనత వల్ల, మా స్నేహం మనుషుల మధ్య ప్రేమగా పెరిగింది! అది

కాలిపోతుందంటే, గుండె తట్టుకోలేకపోతోంది!

❖ ❖ ❖

సుధీర్ మా ఇంటికి వచ్చిన వారం తర్వాత రుద్రయ్య చౌదరి మా ఇంటికి వచ్చాడు. అప్పుడే సూర్యుడు ఉదయిస్తున్నాడు. అయితే – అతడు అప్పుడే ఉదయిస్తున్న సూర్యుళ్లా కాకుండా మండువేసవి మధ్యాహ్నపు సూర్యుళ్లా మండుతూ మా ఇంటికి వచ్చాడు. వేటాడుతూ తిరిగి తిరిగి అలిసిపోయి ఆహారం దొరకని ఆకలి పులిలా కనిపిస్తున్నాడు. భగ్గు భగ్గున మండుతున్న పెనుమంటల్లా కనిపిస్తున్నాడు. జుత్తు పెరిగిపోయి, చెదిరిపోయిన తేనెపట్టులా ఉంది. గడ్డం పెరిగిపోయిన పాపాల మూటలా కనిపిస్తోంది. మెలికలు తిరిగి మాసిపోయిన మీసం, కాటువేసే నల్ల త్రాచులా కనిపిస్తోంది. అతడి కళ్లు ఆడపులి ఆకలి మంటల్లా క్రూరంగా ఉన్నాయి.

ప్రేమగా స్నేహంగా సాదరంగా అతణ్ని ఆహ్వా నించాం. మండే సూర్యుడు మనింటికి వచ్చి మన కుర్చీలో కూర్చుంటే ఎలా వుంటాడో, రుద్రయ్య చౌదరి కూడా అలాగే ఉన్నాడు. పెట్టెలోని మాసిపోయిన బఫ్టీలోంచి తళతళ మెరిసే కత్తి తీశాడు. బఫ్టీలో ఏ రైఫిలో మరేదే ఉందో లేదో తెలీదు. మండుతున్న సూర్యుడు తళతళ ధగధగ మెరిసే కత్తి పట్టుకుంటే ఎలాఉంటాడో, రుద్రయ్యచౌదరి కూడా అలాగే ఉన్నాడు!

'సుధీరూ, సుజాత ఎక్కడున్నారు?' భగభగ మండుతున్న మంట అడిగినట్లు అడిగాడు. మౌనం! మౌనం! నాకు నోరు పెగల్లేదు!

'ఇక్కడా అక్కడా అంతటా తిరిగాను! వెదికేశాను! ఎక్కడా కనిపించలేదు! ఇక్కడే ఉండి ఉంటారు! ఎక్కడ దాచావో చెప్పు!'

నేను శిలలా, శిలావిగ్రహంలా, మౌనంగా ఉండి పోయాను.

'నువ్వు నా శత్రువ్వని తెలుసుకోలేకపోయాను! నిన్ను స్నేహితునిగా చేసుకొని పెద్ద తప్పేచేశాను! పెద్ద నేరమే చేశాను! జీవితంలో పెద్ద అపరాధం చేశాను! ఎక్కడ దాచావో నిజం చెప్పు! సింహంలా గర్జించాడు.

నా భార్య స్వేచ్ఛ భయపడిపోయింది. గబగబ పరుగు పరుగున వచ్చి మా ఇద్దరి మధ్య అడ్డుగా నిల బడిపోయింది.

'అన్నయ్యా! మీరలా ఎందుకంత ఆవేశపడుతు న్నారు! నేను మీకు నిజాన్ని చెప్తాను! వాళ్లెక్కడున్నారో చెప్తాను!'

'నా శత్రువు భార్య నాకు శత్రువే అవుతుంది కానీ చెల్లమ్మ ఎలా అవుతుంది!?'

'అన్నయ్య! నేను నిజం చెప్తాను! అంతా చెప్తాను! వాళ్లెక్కడున్నారో చెప్తాను!'

'అయితే, చెప్పు!'

'నేను మీకు నిజాన్ని చెప్తాను! అంతా చెప్తాను! అయితే – మీరో నిజాన్ని నాకు చెప్తే, మీకు తక్షణమే అంతా చెప్పేస్తాను!'

'అడుగు!' అతడు పిడుగులా గర్జించాడు.

'మీరు వాళ్ల పెళ్లికి ఎందుకొప్పుకోలేదు?'

'కుదరదు! అంతే!' గంభీరంగా గర్జించాడు

'ఎందుకు కుదరదు? అది చెప్పండి!'

'నువ్ ఒగ్గేటట్టు నేదు! నిజం సెప్పనా?! సుజాత తండ్రి ఒవుడు? ఆడొవుడు? ఆడో రాజకీయ పార్టీవోడు! నానొవుణ్ని? నానో రాజకీయ పార్టీ వోణ్ని! వెలగ కుదురుద్ది?! ఏటంటే... ఏతంతే... కుదరదు గాక కుదరదు! అంతే! ఏంటే... వేపంటే.. నానొవుణ్ని?! నాను అధికారంలో వున్న పార్టీ వోణ్ని! ఆడొవుడు? వోడిపోయి, కాళ్లు జారిపోయి, సతికిలబడిపోయి, గూకుండిపోయిన పార్టీవోడు! ఎలగ కుదురుద్ది?! వెలగ కుదురుద్దీ?!' అని ఓట్లు కోసం మాట్లాడే శైలిలో ఆడ పులిలా కాకుండా మగ సింహంలా గర్జించాడు.

'అన్నయ్యా! మీరు నిజాన్ని చెప్పాశారు కాబట్టి నేనూ అంతా మీకు చెప్తున్నాను? వాళ్లిద్దరూ ఇక్కడే మా ఇంట్లోనే వున్నారు! పెళ్లయిపోయి వారం గడిచి పోయింది. మూన్నాళ్లూ ముచ్చటగా మా ఇంట్లోనే గడిపారు?'

'నేను ఓడిపోయాను! నేను ఓడిపోయాను! నేను ఓడిపోయాను!' అని అతడు మగపులిలా గర్జించి, ఆ తరువాత మగ సింహంలా గర్జించి గర్జించి నిరాశలో క్రుంగిపోయాడు. విషాదంలో కూరుకుపోయడు.

'మనుషుల మధ్య ద్వేషాలు ఎవరు పెంచు తున్నారు? శత్రుత్వాలు ఎవరు పెంచుతున్నారు? మనుషులు కలిసి ప్రేమగా బతకలేని వ్యవస్థను ఎవరు నిర్మిస్తున్నారు? ఎందుకోసం ఈ రాజకీయ వ్యవస్థ? ఎవరికోసం ఈ రాజకీయ వ్యవస్థ? ఎవరి బాగుకోసం ఈ రాజకీయ వ్యవస్థ!' అని నేను మనసులో ఆవేదన పడ్డాను. అంతే! రుద్రయ్య చౌదరికి నా ఆవేదన చెప్పలేదు! ఎందుకంటే – అదంతా తెలియని వాడు కాదు రుద్రయ్య చౌదరి.

■